# నమ్మక

మూడేళ్ళ క్రితం విశాఖపట్నంలో ఒకనాటి సాయంత్రం నేనూ, ఒక స్నేహితుడూ మెయిన్‌రోడ్డుమీద పోతున్నాం. నా మిత్రుడు చప్పున ఆగాడు. నేను ఆగి చూసేసరికి సందు మొదలలో నిల్చొని వున్న ఒక వయస్సు మళ్ళిన వాడికి నమస్కరిస్తూనే దగ్గరగా వెళ్ళాడు. మా వాడిని అనుసరించాను. ఆయన అరవయ్యో పడిలో వుంటాడు. పొట్టి కాదు, పొడగరీ కాదు. బక్కమనిషి. నోరు యేదో మెత్తని పదార్థం చప్పరించటానికి పనికి వస్తుంది. చెవుల్లో వెంట్రుకలు మీసాల్లా తిరిగి బయటకు వస్తున్నాయ్. ఫాలభాగంలో

విభూతి పిండికట్లు కనీ కన పడ నట్లున్నయ్. సగం పండి పిలక చివర మెడమీద పడుతోంది. చేతికుట్టుతో రిపేరీ చేసిన పొట్టితెల్లని కమీజు, మాసి మాయునట్టున్న పొట్టి పంచె కట్టుకున్నాడు. మా మిత్రుడు అంత వినయం కనపర్చకపోతే ఆయన యందు నా పై ఖరి వేరేగా వుండేది. మా వాడు సైగచేస్తూ గట్టిగా అన్నాడు. "తమ కోసం నిన్న సాయంత్రం వచ్చాను. అమ్మగారు యింట్లో లేరని చెప్పారు" ఆయన చెవిదగ్గరగా చెయ్యి పోనిచ్చి వినపడలేద న్నట్లు చూపాడు. మా వాడు మెల్లగా చెవి దగ్గర నోరు పెట్టి ఆ మాటలే కామోసువూదాడు. లోతులేని నూతిలో నుంచి మాట్లాడి నట్లుగా "పనిమీద బజారువేపు వెళ్ళా"నన్నాడు, ఆ సంభాషణ అర్థం చేసుకోటానికి అభినయం మూడు పావులు పనిచేసివుంటుంది.

మా వాడు నాతో అన్నాడు "రా-ఇప్పుడే వచ్చేద్దా" మని, నేను కాదనలేక వెంటపడ్డాను. సందురోడ్డు సిమ్మెంటుదైనా చెత్తా చెదారం లేకపోలేదు. ఆ సందులో నించి యింకో సందు వేపు తిరిగాం. ఇద్దరు జతగా నడవటానికి తగ్గ వెడల్పు, దుర్వాసన ఘోరంగా వుంది. జేబురుమాలు తీసి ముక్కు మూసుకొని పది గజాలు నడచి వుంటాను. తలుపులేని గుమ్మం దాటి వెళ్ళాం. ముం దుగా అగపడింది చిన్న నుయ్యి. ఆ నూతికి వెనకాలే ఎత్తైన కుం డిలో తులసి చెట్టు వుంది. ఆ వెనుకను రెండు గుమ్మాలతో ఒక పెంకుటిల్లు వుంది. బిళ్ళ పెంకుతో వున్న ఆ యింటి కప్పు చూస్తూంటే వానజల్లుకు ఆ యింట్లో బదులు వీధిలో కూర్చుంటే నయం అనిపిస్తుంది.

ఆ ముసలాయన గుమ్మందాటి వెంటనే నూతి గట్టుమీదనున్న

గోలెంలో నీరు తీసి కాళ్ళు కడుక్కున్నాడు. మావాడు వేసుకున్నవి ఆకు జోళ్ళు కాబట్టి అక్కడే సులభంగా విడిచి పెట్టాడు. తటపటాయిస్తున్న నా వైపు చూసి ఫరవాలేదన్నట్టుగా చెయ్యివూపాడు. తుంగచాప వాకిట వేశాడు. బూటుకాళ్ళు బయట పెట్టి ఒక చివరను కూర్చున్నాను. వెలుతురు బాగనే వుంది. ఆవుపేడతో కళ్ళాపి జల్లటం వల్ల పైన వుండిన దుర్గంధం లోన లేదు.

ఇద్దరికీ మధ్య మఠం వేసుకు కూర్చున్న మావాడు కుడి అరచేతిని ఆయన యెదురుగా పెట్టాడు. బొక్కి ఫ్రేముతో వున్న కళ్ళద్దాలు తగిలించి చాలా చిన్న చిన్న రేఖలను చూపిస్తూ చెప్తున్నాడు ఈ పిచ్చి మా వాడి కెలా పట్టిందని ఆలోచించు కుంటున్నాను. ఇంతలో నే యింటిలో నుంచి ఒక పండు ముదసలి వచ్చి "శంకరం మూడు రూపాయ లిచ్చి వెళ్ళాడురా అబ్బాయ్" అంది. ఈ సంబోధన బట్టి ఆమె ఆయన తల్లి అని నిర్ధారించుకున్నాను. చెప్పటంలో అలవాటుపడ్డదేమో ఆయన వెంటనే వుంచు అని సైగ చేశాడు. ఈ మాటలతో నా అనుమానం బలపడింది. మళ్ళీయింటిలోకి నడిచి వెళ్ళిపోతున్న ఆ యెముకల పోగు వేపు చూస్తున్నాను. ఆ ముదుసలి తలను కప్పుతూ కట్టుకున్న అంచు లేని వస్త్రం కొన్నప్పుడు తెల్లదైనా రోజూ తెల్లవారకముందు స్నానం చేసేటప్పుడు తడవటం మూలాన కొంచెం గోధుమ రంగుగామారింది. ఆమె వెళ్ళిపోతూ ఆగి తులసి చెట్టుకు ఒక మ్రొక్కు మ్రొక్కింది. ఇంతలోనే మా వాడు నాకుడిచెయ్యి లాగాడు. నేను ముఖంలో లీలగా విముఖత చూపించాను. ఎటూ మొగ్గని నా హృదయాన్ని ఒక్క అర్థవాక్యంతో ఆ వృద్ధుడు తనవేపు కొద్దిగా మొగ్గించుకున్నాడు. "ఆర్టిస్టిక్ హేండ్ లా వుం" దన్నాడు. ఈ యింగ్లీషు పదాలు నన్ను

కొంత చకితుని చేసినా చెయ్యిచూపించాలనే కోరికతో పాటు, ఇదొక యెత్తా అనే సందేహం కూడ నాలో గుమ్మరించింది. ఈ అసందిగ్ధ పరిస్థితిని మావాడు గప్పున నాచేతిని లాగి ఆయున యెదరగా పెట్టడంతో హతమార్చాడు.

కొంత సేపు ముగ్గురం మూగపోయాం. "మీ బొటన వ్రేలు చూసి నేను ఆర్టిస్టిక్ హేండని చెప్పాను. చూశారా ఎలా నిటారుగా పొడుగ్గా వుండి చివర వంగి వుందో" అన్నాడు. నేను తలవూపక విధిలేక పోయింది. తరవాత ఒక్కొక్కటిగా రేఖలను చూపిస్తూ ఫలితాల్ని చెప్పుకొచ్చాడు. చెప్తున్నంత సేపూ నా దృష్టి చేతిమీద బాగా కేంద్రీకరించాను.

ఎడతెగని ఆలోచనలతో మెదడు పనిచేస్తూనే లేచేముందు మా వాడి చెవిలో పర్సు చాలా ఖాళీగా వుందని వూదాను. మా వాడు గంభీరంగా అన్నాడు."ఒక దమ్మిడీ పుచ్చుకోడురా" అని, నాకంతా అయోమయం అనిపించింది. అప్పటి మట్టుకు యేమీ మాటాడకుండా మా వాడితో పాటు నేనూ ఒక వంక దండం పెట్టి శలవు తీసుకొని బయుట కొచ్చాను. తరవాత చెప్పాడు–వచ్చే పించనుతో జీవిస్తున్నట్లు. ఆయనకు దిక్కూ, మొక్కూ ఆ తల్లే అనీ, జాతకాలకి తప్పించి యిటు వంటి చిన్నవాటికి డబ్బు పుచ్చుకోడనీ చెప్పాడు.

ఆనెల రోజుల్లోనే ఆఫీసుకు ఐదురోజులు శలవు పెట్టి నా జన్మ స్థలానికి వెళ్ళాను. మా గ్రామం విశాఖపట్నానికి ఉత్తరంగా 80 మైళ్ళ దూరంలో ఒక నది పడ్డున వున్నది. ఆ నది సాధారణంగా హిందూదేశపు పటంలో కనపడను. మా గ్రామం దగ్గరే ఆ నది పై

మూడు ఫర్లాంగుల వంతెనుంది. పదిహేనేళ్ళ క్రితం తెరచినజమీం దారు తన పేరు పెట్టుకున్నాడు. గానీ పాటక జనం "పెద్దేరువా రాది" అంటారు ఈ నది మా జిల్లాకు పెద్దనది కావటంవల్ల. మా నాన్న ఈ వూరి కరణం. వంశ పారపర్యంగా హక్కు వున్న ఉద్యో గంతో పాటు స్వంత సేరీ వుంది, ఒక నౌకర్నీ, జత దున్నపోతు లను పెట్టి వ్యవసాయం సాగిస్తూ వుంటారు. ఈ వూర్లో వ్యవసాయపు పనిపాట్లు చేసుకొని జీవించే కూలిజనం హెచ్చు. సామాన్యుల సంతానాలు ఆ సంస్కారాన్నే అలవర్చుకున్నయ్.

పామిష్టు చెప్పినప్పుడు యే గీత యేదో దేనివల్ల యేం ప్రయోజనమో యిటువంటి వన్నీ పరీక్షగా చూశానేమో పుబుసు పోక పోతే పొరుగింటి విధవావిడ చెయ్యిచూసి చెప్పాను. నా కొచ్చిన శాస్త్రం శూన్యం, కాని నోటి బుకాయింపు. ఆవిడ జీవితం చాల వరకు తెలుసు కాబట్టి నమ్మిక కలిగేటట్లు చేశాను ఈ నోటాఅ నోట ప్రాకింది నేను చేతులు చూసిన సిద్ధాంతి నయ్యానగి. మొదట ఒకరు, తరవాత యిద్దరు రానురాను యిదివరకు చూడని మను షులు కూడా వచ్చారు. వీళ్ళందరినీ వదిలించుకోడానికి నా తల పగిలిపోయింది. ఇప్పుడు నిజం చెప్పినా వీళ్ళకి శుద్ధ అబద్ధం అయిపోతోంది. బలవంతం క్రిందకు రాగానే లాభం లేదని ఒక షరతు పెట్టాను. "నేను డబ్బు పుచ్చుకోను. మీరేమీ నన్నడగొద్దు. చెప్పిందేదో వినేసి వెళ్ళి పొమన్నాను" ఆతృతతో వున్న వారి తల లూగాయ్, నిముషాల్లో నా కోతలు యేకష్టాల పూసు యెత్తకుండా వెల్లి పోయాయ్. ఎత్తినకష్టాలయినా చెప్పకోతగ్గవి కావు.

నేను తిరిగి వెళ్ళిపోయాక మళ్ళీ అక్టోబరు నెలలో మా వూరు

వెళ్ళవలసి వచ్చింది. రైలులో మూడు గంటల ప్రయాణం. మా నాన్నకు బహు వ్యాపకాల వల్ల నీరసం చేసింది. చూట్టానికి రమ్మన మన్నారు. ఈ సారి మా నౌకరు మారటం గమనించాను. నన్ను చూడగానే "దండం బాబూ నిబ్బగా సెప్పావు" అన్నాడు. ఏమిటి నిబ్బగా చెప్పానో కనుక్కోటానికి మా అమ్మ కేక వినబడటం వల్ల అప్పటికి వీలు లేక పోయింది. వీధిసావిడిలో వాలుకుర్చీ మీద కూర్చొని కాఫీ త్రాగుతుంటే మా నౌకరు వచ్చి నా కాళ్ళ చేరువలో కూర్చున్నాడు. "నీ పేరేమిటిరా" అని అడిగాను కప్పు క్రింద పెట్టి. "లొట్టోడ్ని బాబూ" అన్నాడు.

ఈ ప్రాంతంలో కూలీ నాలీ చేసుకుని బ్రతికే పాటక జనాన్ని వాళ్ళ యింటి పేరు పెట్టి పిలుస్తారు. ఇంటి పేళ్ళే వాళ్ళకి వ్యావహారిక నామధేయా లౌతుంటాయి. అంచేత మా నౌకరు "లొట్టి". అసలు పేరు కనుక్కునే అవసరం లేక పోయింది.

వీడి వయస్సు యించుమించు నా వయస్సంతే వుంటుంది. పాతికేళ్ళ లోపు వాడైనా మనిషి చాలా బలిష్టంగా, నల్లగా భారీగా వుంటాడు. ముక్కు మొద్దుగా వుంది. పళ్ళు కొంచెం గోధుమ వర్ణంతో కాస్త వుఠవగా వున్నయ్. పాదాలు మొరటుగా వగుళ్ళు దీరి వున్నాయ్. తలకి మాసిన చింకి పంచెముక్కతో చిన్న తలపాగ చుట్టాడు. ముక్కులోనూ, చెవుల్లోనూ చిన్న బంగారపు రింగులు అంటిపట్టి వున్నయ్. మెడలో కాశీతాడు అక్కడక్కడ ముడులతో వుంది. ఈ నల్లటి తాడు వేసుకొనే వాడు గరిడీ విద్యలో ప్రవేశం వున్న వాడని చెప్పాలి. దుప్పటి గుడ్డతో కుట్టిన

భుజం కలిగిన చిరిగిన పొట్టి బనియను వేసుకొన్నాడు. ముడుకులు దిగని పంచె మరికాస్త మీదికి యెగగట్టాడు.

ఇదివరకు వీడి ముఖం చూసినట్టు జ్ఞాపకం వుంది. "ఇత్త నాలు పోసిన రోజుల్లో వచ్చి సెయ్యి సూసినావు కదూ బాబూ— నిబ్బగా అలాగే అయిన దన్నాడు." ఇదివరకు ఈ వూళ్ళో చూసిన చేతుల మధ్య యీ చెయ్యి చూసినట్లు సరిగ్గా జ్ఞాపకం లేదు. ఏం చెప్పానో ఏమిటో నాకే అయోమయంగా వుంది. మళ్ళీ వాడిప్పుడు చెయ్యిచూడమని బలవంతంచేస్తే మొదటచెప్పినదానికీ యిప్పుడు చెప్పినదానికి యెటువంటిపోలికావుండదని నాకుతెలుసు అటువంటిపరిస్థితివస్తేయేదో అబద్ధంఆడితప్పించుకోవాలనేసంకల్పంతోనేవున్నాను మొదటిలోనేఒకవిసురు విసిరాను, 'అబ్బే' నాకు చేతులు చూట్టం తెలీదురా. నోటికొచ్చింది చెప్పాను." ఈ మాటలు నేను శుష్క హాసం చేస్తూనే అన్నాను. లొట్టి పకపక నవ్వి "లే బాబో! నాతో పరాసకాలేంటి? సేతులు సూట్టం తెలీక పోతే నిబ్బగా యెలా సెప్తావు?"

ఆ నిజమేంటో నాకూ వినాలని లేక పోలేదు. నా ఆతృతకు తగ్గట్టు గానే వాడు మొదలు పెట్టాడు. "ఆ నాడు సెప్పినావు. నాను బతికి నన్నాలూ ఒక్క దాంతోనే వుంతానని. నాను ఆనాడు నమ్మనేక పోనాను. అప్పాటు దానికి మా సెడ్డ తలతిరుగున్నాది. దాన్ని యిడిసి పెట్టి యీ శాకులు తెంపేసుకోవాలనుకున్నాను, అప్పాడే బాబు యిలా సెప్పినావు"

నా కోతల పామిష్ట్రికి యేదో విలువ వచ్చిందని "అయితే యేం జరిగింద"ని, అనుబంధ ప్రశ్న వేశాను. లొట్టి తలపాగ చుట్టుకొని చెప్పాడు.

"నాకు ఒక్క పెళ్ళాం అంటే ఒక్క పెళ్ళమనే బాబు సెప్పినావు. నా సేతిలో అలా వుండబట్టి సెప్పినావు. సేతిలో యెల్లాగ వుంతే అలా జరగతాది గానీ మనం యింకో నాగ సెయ్యాలన్నా అవుతాదా? నాకు బగమంతుడు ఆలోచన పుట్టించి నాడు. అదా పైదాయి కాదు. మేనమావఁ కూతురు. ఒకనాడు కాకపోతే మరో నాడు దాని మనసు మారి యేలుకోదా? నాకు సాలా మంది సెప్పినారు. దాన్ని మంచి కబుర్లుకో కంగదీసి కన్నారింటి నుంచి తీసుకొచ్చినాను. పెట్టిన బంగారం అంకించుకుని బాగా తన్నేసి తగిలేమన్నారు. నాకు కోపమైతే వచ్చినాది. గానీ మళ్ళా ఆలోసించాను. నా గీతలో ఒక్క పెళ్ళావఁనే వున్నాది. దీన్ని గాని వదిలేసుకున్నానంటే ఆ బంగారం పిసర మావోళ్ళు అంకించేసుకుంటారు. కరువు రోజులా మరి—కడుపు కేసుకుంటే మళ్ళా నా సేత్తో నేను రెండు తొలాల బంగారం గడిస్తానా? అది ఎర్రగా బుర్రగా వుండాది. నాను వదిలేస్తే దానికి మారాజు నాంటి మొగుడొస్తాడు. ఈలందరి మాటిని దాన్ని గాని వదిలేశానో రెండి దాలా సెడతాను. సేతులో వున్నాది వదిలెయ్యాలన్నా యీలు పడతాదా? దాని కన్నారింటి కెళ్ళాను. ఇన్నాళ్ళాగ సెయ్యి సేసుకోకుండా మెల్లిగా వారం రోజులుండి మంచి కబుర్లతో మచ్చిక సేసినాను. ఒకంతట లొంగినాదా? మా పూరి కరణం బాబు కొడుకు పెద్ద సిద్దాంతి. సెయ్యిసూసి ఒక్కటే పెళ్ళవఁని సెప్పినాడు. ఆ మారాజు సేతిలో వున్నది సెప్పినాడు. నివ్వెన్నన్నా నా దగ్గిరికే వస్తావు. ఆ గీతలో అలాగ వున్నాది."

నేను చప్పున "అదీ నమ్మిందా" అన్నాను.

"నమ్మక యేంచేస్తాది బాబో! సేతిలో వున్నది నిబ్బగా

సెప్పినావు. కానీ యేగానీ పుచ్చుకుంటావు గనకనా యిచ్చకంగా అబద్ధాలు సెప్పటానికి."

నేను నా ఆలోచనలో వుంటుండే ఊకొట్టున్నాను, మళ్ళీ మొదలు పెట్టాడు. "దాని మనసేం తిరిగినాదో నాలుగు రోజు లుండు మావాఁ కలిసి యెల్లిపోదా వన్నాది. అలాగే వున్నాను. వచ్చేసినాది. ఆయేళ నించీ కలిసీ మెలిసీ వున్నాంబాబూ ఇప్పు డెల్లి దాన్కి సెప్పినాను ఆ బాబు వచ్చినాడని, దాని సరదా యింతా అంతా కాదు. బాబుకి మొక్కాలని సెప్పనుంది."

ఇంతలోనే లోట్టికి పనితగలటం చేత వెళ్ళిపోయాడు. నేను చాలా సేపటి వరకు కుర్చీకి అంటుక పోయాను.

ఆ వేళ రాత్రి బాగా చీకటి పడ్డాక అంగటి గదిలో పరుపు మీద చారబడి బయట జరుగుతున్న గందరగోళం వింటున్నాను. మా యింటి యెదరగా అంగట మర్రిచెట్టుంది. దానికి కచేరీమర్రి చెట్టని పేరు, మా తాతల కాలంలో కోర్టు లెక్కకుండా వూరి పెద్ద మనుషులు అక్కడ కూడి తగాయిదాలు తీర్చేవారట. మా తాత రోజూ చీకటి పడ్డాక వీథి అరుగు మీద ఒక ఆముదపు ప్రమిద దగ్గర పెట్టుకొని ఆ దీపపు కాంతిలో పురాణ కాలక్షేపం చేస్తుండే వాడట. అంచేత వూరిలో చిన్నా పెద్దా సాయంత్రమైతే ఆ చెట్టు దగ్గర గుమిగూడే వారు. మా తాత చనిపోయాక అటువంటిదేమీ జరగక పోయినా వూళ్ళో వాళ్ళు వచ్చి కూర్చునే అలవాటు మాత్రం పోలేదు. ఇప్పుడు ఆముదపు దీపం బదులు హరికెన్ లాంతరు వెలుగుతుంటుంది. అక్కడ గుమిగూడిన కొందరు గ్రామప్రజల గొంతుకలే వింటున్నాను. ఒక గొంతుక: "ఆ మనసకు కలిగింది.

అన్నమో అంబలో తింటున్నాడు. నాకు లేదు. ఆయన అదృష్టం అది. నా కర్మ యిది. అనుకున్ని తిట్టి మనకేం వస్తాది ఊరుకోరా వాడికున్నాది మనకు లేదని యేడిస్తే రెండు కళ్ళూ పోగలవు."

ఇంకో గొంతుక: "అడు నలుగురి బుర్రా కొట్టున్నాడే అనుకో, మనం యెన్నన్నా అకు మానేస్తాడా? అడి పని అడు సేస్తాడు. సెయినీరా? ఎవడు బుర్ర కొట్టినా ఆ జానెడు పొట్టకే. యెలిపోయేటప్పుడు ఒక గుడ్డపాత కూడ తీసుక పోడు."

ఈ విషయం నాలుగ్గొంతుకలు కలిసి రసాభాస అయి చివరకు "మనం యెందుకిలాగ కొట్లాటం-అందరికీ పైన ఒకడున్నాడుగా" అని తేల్చేసి యీ విషయాన్ని ఆపేశారు.

తర్వాత రేగిం విషయం డాక్టరు చేతకానితనంవల్ల ఒక మనిషి చనిపోయాడని.

ఒక గొంతుక: ఆ వయిదిగుణ్ని యెందుకలా తిడ్తారు? ఆడికా యోగం వుండి సచ్చాడుగాని" ఇంకో నాజూకైన గొంతుక: "ఇంజక్షన్ యివ్వటం వాడికి సరిగా చేతగాదు. ఏ కాలీజీలోనూ చదివి వాడు డాక్టరు కాలేదు. సూది దండలో యిరిగి పోవటంవల్ల సెప్టిక్ అయి రోగి చచ్చిపోయాడు. జబ్బువల్ల కాదు."

ఇది మా నాన్న గొంతుకే.

ఇంతలోనే చటాలున లొట్టె గొంతుక వినిపించింది. బహుశః అభినయంతోనే యీ మాటలు అంటాడు "రా బాబో! ఆడి సేతిలో వున్నట్టు జరక్క మానాదా? ఆడి-సేతిలో ఆయేళకి సావాలని వున్నాది-వయిదుగుడు కాదు-అరిఅర బెమ్మాదులు రచ్చిస్తారా?"

ఈ మాటలు వినగానే నా నవ్వులో నేనుండి పైన కబుర్లు వినలేదు.

ఆ నవ్వు కొద్ది నిముషాల్లో ఆశ్చర్యంగా మారిపోయింది. ముక్కు మీద వేలు వేసుకున్నాను. నోరు ఆవలించుకున్నాను.

ఆ మరుచటి రోజు ఉదయం రాత్రి సంగతి యెత్తి లొట్టితో చెప్పాను. అలా చాటుక తిరగొద్దని—

"ఉన్న మాట సెప్పితే వూరల్లా కోపమే—మన సేతిలో ఆ యేళకి మారకం నేరగపోతే సచ్చిపోతావాఁ!"

"సరేగానీ! నేను చేతులు చూస్తానని యెవరితోనూ చెప్పకు."

"సాటుక తిరిగితే వున్నాది, నేకపోతే నేదా? ఇద్య జగమంతు డిచ్చినాడు. మా లాంటోలికి వూరకనే సెప్తావు. పున్నెమేనా మరి. మీ సెయి సూసుకొని మంచీ సెడ్డా తెలుసుకండావు."

నేనింకా ఏమీ అనకుండానే గడ్డిబుట్ట, కొడవలీ పట్టుకొని నవ్వు మొఖంతో "గుండెమీద గునపం పోటో—" అంటూ కూనిరాగాలు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఈసారి నేను వెళ్ళిపోయాక నెల రోజులలో బొంబాయి బదిలీ అయింది. అక్కడ మా దగ్గర బంధువు వుండబట్టి యిక్కడిలా హోటల్లో బాధ పడనక్కర్లేదు. బొంబాయి నుంచి తూర్పు కోస్తాలో వున్న మా గ్రామం రావాలంటే అథవా వంద రూపాయలు ఖర్చు పెట్టాలి. అంచేత కొన్నాళ్ళ వరకూ యింటి ముఖం చూట్టం జరగదు. ఉత్తరాల ద్వారా వచ్చే భోగట్టాలలో అంతా యింటి గురించీ చుట్టాల గురించి గాని వూరి విషయం ఏమీలేదు.

నేను ఆశించిన వుత్తరం బొంబాయి వెళ్ళాక రెండేళ్లకు వచ్చింది. మా నాన్న వూరి విషయం వ్రాశారు. ఆ విషయం విచారించ వలసినది. కలరావల్ల చాలా మంది చనిపోయారట, మా నాన్న కొక్కడా కలరా సోకిందట. పట్నంలో పేరున్న డాక్టరుకు

మూడువందలవరకూ పోసి ప్రాణం నిలబెట్టు కుపోరట. నే ననుకు న్నాను. యిలా డాక్టరుకు డబ్బు పొయ్యలేక యెందరు చచ్చారో అని. నా ప్రయాణం యిప్పుడు అవసర మయ్యింది.

నన్ను చూడగానే మానాన్న కన్నీరు తెచ్చుకున్నారు. నా రాక మూ వాళ్లకు ఒక అప్రధానమైన విషయం కాదు. అప్పటిలో నా మట్టుకు నాకు యిందులో యే ప్రాధాన్యతా కనపడ లేదు. ఎంచే తంటే మా నాన్న మాయమ్మలుగా పుష్టిగానే వున్నారు.

భోజనం దగ్గర మా అమ్మతో మాటల్లో మాటగా లేచిపోయే ముందు "లొట్టి బావున్నాడా" అని అడిగాను. "ఇప్పుడు మనలో లేడు, నాయుడింటిలో వుంటున్నాడు. పాపం! వాడి పెళ్ళాం మొన్న కలరాలో చచ్చిపోయింది " అని చెప్పింది. చివరి వాక్యం వింటా నికి నాకు కష్ట మనిపించింది. నే నొచ్చానని తెలిసి లొట్టె వచ్చి యేడ్చేటప్పుడు యేం సంజాయిషీ యివ్వాలో నాకు అంతుపట్టలేదు. కొత్నాళ్ళు పోయాక నేను వచ్చుంటే అప్పటికి దుఃఖం కొంత దిగ మింగేవాడేమో అట్టే గొడవలేక పోయేది.

సాయంత్రం వీధిలోనికి వెళ్దామని బయలు దేరాను, బొం బాయిలో కీర్తింప బడని యీ దుస్తులకు యీ పల్లెలో కొంతకీర్తి రప్పిద్దా మనే వుద్దేశంతోనే బయలు దేరాను.

వీధి చివరను లొట్టె కనిపించాడు. వాడి ముఖం అంత దూరంలో వుండగానే చూట్టానికి నాకు సిగ్గు వేసింది. ప్రక్కకు తిరిగి ట్రంకురోడ్డు వేపు పోతున్న వీధిలోనికి మళ్ళాను, లొట్టె నా వేపు పరుగెత్తి అంతదూరం నించే "దండం బాబూ".అంటూ కేకలు వేసుకు రావటం గుర్తించాను. నా మనస్సు చాలా ఆందోళన పడ

సాగింది. అనుకోకుండా వేగంగా నడిచి పోతున్నాను. ఆవీధిదాటాక యిసుక త్రోవదాటితే గాని రోడ్డు చేరుకోలేను. ఆ త్రోవలో పడే సరికి లొట్టె చేరుకున్నాడు.

"కాఫీ వేలై పోతున్నాది గావాల. అంత జోరుగా యెలిపో తన్నావు బాబు."

ఆ గొంతుక పేలవంగా వినిపించింది. తొందర్లో "హాఁ" అని అబద్ధం ఆడాను. రోడ్డు మీద చిన్న పాక ఆవూరి కాఫీహోటలు, చవకగా దొరికే మేకపాలు, గొఱెపాలతో కాఫీ, టీలు తయారవుతుంటాయ్. ఆ హోటలుకు పోయే అవసరం నాకు లేదు.

"బాబూ సాలాకాలానికి వచ్చినావ్! ఓ! నిబ్బగా సెప్పినావ్,"

ఈ పరిహాసం నా వొళ్ళు నొక్కి వేసింది. వాడి నెలాగైనా వదిలించుకోవాలని గబగబ నడుస్తూనే "పాపం! వెళ్ళు" అని గొణిగాను.

"అది ఆనాడే నీకు దండమని సెప్పమన్నది బాబూ! బాబు నానిదే యెలా సెప్పను!"

చచ్చేముందు యిలా చెప్పమందేమో అని అనుకున్నాను. ఇంతవరకూ వాడి ముఖం వేపు నేను చూడ లేదు. నా యీ విముఖత్వం వాడికి కించపరిచిందేమో యెదురుగా వచ్చి "ఇంటి కెప్పుడెల్తారు బాబూ" అన్నాడు. చిరాకుగా "యిప్పుడే" అని యింకో అబద్ధం ఆడాను.

"అయితే నేనూ అదీ కలిసొచ్చి బాబుని సూస్తాం. దానికి సూడాలని సాలా మనసుంది," అన్నాడు. ఈ మాటలతో నేను కొయ్యబారి పోయాను. నిలబడే "నీపెళ్ళాం బతికుందా" అన్నాను.

"ఉండక ఏమైపోతాది బాబో" అన్నాడు పెద్ద ముఖంతో.

"మా అమ్మ నీ పెళ్ళాం కలరాలో చచ్చిపోయిందని చెప్పిందిరా?"

"నా పెళ్ళాం కాదు. మా యన్న పెద్ద లొట్టోడి పెళ్ళాం. గొట్టాలమ్మ వచ్చిన దగ్గిర నించీ సచ్చిపోతాను సచ్చిపోతా ననేది. అలాగే సచ్చిపోనాది."

నేను స్తబ్ధుడనై నిలుచున్నాను. మా అమ్మ పెద్ద లొట్టోడి విషయం ఎందుకు చెప్పిందని ఆలోచిస్తుంటే లొట్టి నవ్వుతో ముఖం వికసింప చేసుకొని చెప్పాడు. "ఆ సుట్టు మీరొచ్చినారే ఆ వారం రోజుల్లోనే మా మావ జబ్బుపడి పోనాడు. బక్కొ బడుగు వున్న కొంప. పెద్ద లొట్టోడికి మీ పనప్పసెప్పి అదీ నాను కలిసెల్లినాం. అక్కడ నోది గొప్పుల దాకా వుండిపోనాను." "సరే! తిరిగి వచ్చాక మా పనిలో చేరక పోయావా?"

"మాయన్న మీ కాడ వుంటానన్నాడు. ఎవుడైతే యేంటని నాను రెడ్డోరింట్లో ఉదిరినాను."

మా అమ్మ యెందుకలా చెప్పిందో అర్థమయింది.

"మీ యన్న ఎందుకు మానేశా" డన్నాను.

"మొన్న పంటకి ఒకపుట్టిడు ధాన్నంయెచ్చు సెయమన్నాం. బాబు ఒప్పుకోలేదు, నాయుడోలు పుట్టిన్నర ఇప్పిస్తా మన్నారు. అల్లోకి యెలిపోనాడు బాబూ" అన్నాడు.

తరవాత వాడి పెళ్ళాం జబ్బుగురించి చెప్పుకొచ్చాడు. "మా వదిన్ని పల్లకాడికి తీసుకెల్లి యింటి కొచ్చే టప్పటికి గొట్టాలమ్మ

పట్టుకున్నాది. అందరూ యిఁదీ మా వదిన నాగ సచ్చిపోతాద న్నారు. యిరుగుపొరుగోలు వాకిటే సేమన్నారు. నాను ఒద్దంటే ఒద్ద న్నాను. నాకు సాలా దయిరం వున్నాది. నాగితలో నా కొకపెళ్ళావనే వున్నాది. దానికీ అదే దయిరం. ఒంటి మీద సొత మున్నప్పుడు నన్నుచూసి నాసెవులోఅన్నాది. "నాను సచ్చిపోనంటే సచ్చిపోను. అ బాబు సెప్పినాడు కదా నీకు నా నొకర్తి నే నని." వయిదుగుడు ఏదో నూరి పోసినాడు. మావదిన కెసిన మందేనా అది! ఆడి కొమాట దక్కి పోవాలని గానీ— నా సేతిలో వున్నట్టు జరక్క మాన్తాదా? బెతికింది. ఇంకా పనిపాటల్లోకి యెల్ల నేదు. అప్పుడు నుంచీ బాబుని సూడాలని మా యెత పడుతోంది."

నేను నిలువునా నీర్రై పోయాను. కొంత సేపటి వరకూ నా నోరు పెగల్లేదు.

"సరే! నడు మీ యింటికి వెల్దా"మన్నా. ఆనందంతో అంగలు వేస్తూలొట్టె వెంటపడ్డాడు.